

తిరస్కారమే పరిష్కారమా?

పొగాకు వేలం కేంద్రాలకు వచ్చిన బేళ్లను వ్యాపారులు భారీగా తిరస్కరిస్తుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పొదిలిలో పరిస్థితి రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

- 10లో..

జిల్లాలో విద్యుత్ బకాయిలు రూ.600 కోట్లు



జిల్లాలో రూ.600 కోట్ల విద్యుత్ బకాయిలున్నాయని, వాటి వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ఆ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు.

- 10లో..

గరిష్టం/కనిష్టం
36 /28.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మార్కెట్‌కి అనుగుణంగా బేళ్లు తీసుకురావాలి


- పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



వేలాన్ని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

కొండపి: మార్కెట్‌కి అనుగుణంగా పొగాకు బేళ్లు తీసుకురావాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ సూచించారు. శుక్రవారం కొండపిలోని పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ రైతులంతా మార్కెట్‌లోకి అనుగుణంగా పొగాకు బేళ్లను తీసుకురావాలని కోరారు. మండెల్లో మగ్గిన పొగాకును బేళ్లు కట్టుకుని అమ్మకానికి తీసుకురావాలన్నారు. బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చేటప్పుడు తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న మార్కెట్ పరిస్థితులను రైతులకు వివరించారు. రైతులు వేలానికి తీసుకొచ్చిన బేళ్లలో నోబిడ్స్ లేకుండా మంచి సరాసరి ధరతో కొనుగోలు చేసేలా బయ్యర్లతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయడం ఎంతో అవసరమని అన్నారు. ఇది రైతుల్లో నెలకొన్న అసంతృప్తిని తగ్గించడంలో కీలకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అధికార కూటమిలో చాపకింద నీరులా లుకలుకలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. జిల్లా కేంద్రం ఒంగోలులో టీడీపీ – జనసేన మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంది. మినీ మహానాడు వేదికగా తాజా మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిపై ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేసిన విమర్శలు కూటమి పార్టీల్లో దుమారాన్ని రేపాయి. జనసేన నాయకులు సైతం తగ్గేదేలేదంటూ మీడియా వేదికగా దామచర్లపై విరుచుకుపడ్డారు. రెండు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో చేసుకుంటున్న ఆరోపణలు పొలిటికల్ హీట్‌ను పెంచాయి. గతంలో చేసిన పాపాలకు భయపడి బాలినేని హైదరాబాద్‌లో కూర్చున్నాడని దామచర్ల ఆరోపించారు. జే ట్యాక్స్‌తో ఎమ్మెల్యే వర్గం అక్రమాలకు పాల్పడుతోందంటూ జనసేన నేతలు ఆరోపణలు గుప్పించడం చర్చనీయాంశంగా మారింది.



మినీ దుమారం.. మాటల గరం!

- కూటమి పార్టీల్లో రచ్చ..రచ్చ
- ఒంగోలు ఎమ్మెల్యే, తాజా మాజీ ఎమ్మెల్యేల మధ్య రగులుతున్న వివాదం
- ఒకరిపై ఒకరు ఆరోపణలతో ఆ పార్టీల మధ్య రేగుతున్న దుమారం
- విభేదాలు రచ్చకెక్కడంతో టీడీపీ – జనసేన మధ్య పెరుగుతున్న గ్యాప్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ – జనసేన మధ్య ఒంగోలు కేంద్రంగా రచ్చ కొనసాగుతోంది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని జనసేనలోకి చేర్చుకోకుండా అడ్డుకునేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చాలా ప్రయత్నించారని, కానీ అధిష్టానం ఆయన మొర ఆలకించలేదని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని అప్పట్లో జోరుగా ప్రచారం సాగింది. బాలినేనికి వ్యతిరేకంగా టీడీపీ నాయకులు ఒంగోలులో ర్యాలీలు సైతం చేశారు. అయినప్పటికీ బాలినేనిని జనసేనలోకి చేర్చుకున్నారు. దాంతో ఆయన ఏ పార్టీలో ఉన్నా వదిలేది లేదని ప్రకటించడమే కాకుండా నేరుగా జనసేన అధినేత మీద కూడా విమర్శలు చేశారు. అప్పటి నుంచి సమయం దొరికినప్పుడల్లా బాలినేనిపై ఎమ్మెల్యే దామచర్ల విమర్శలు చేస్తూనే ఉన్నారు.

అరెస్టు చేస్తారన్న భయంతోనే జనసేనలోకి...

అరెస్టు భయంతోనే మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ పారిపోయాడని, జనసేన పార్టీలో చేరాడని మినీ మహానాడులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేసిన విమర్శలు కాకరేపుతున్నాయి. అంతేగాకుండా రోజుకో రీల్ చేస్తున్నాడని, 10 రోజుల్లో ఎమ్మెల్సీ అయిపోతున్నానంటూ ఒక రీల్ చేస్తాడని, మళ్లీ 10 రోజుల్లో మంత్రి అయిపోతున్నానంటూ మరో రీల్ చేస్తాడని, మరో 10 రోజుల్లో 4 జిల్లాలకు ఇన్‌చార్జిగా వస్తున్నానని రీళ్లు చేసుకుంటున్నాడని ఎద్దేవా చేయడంతో జనసేన నాయకులకు చురుక్కుమంది. అంతేగాకుండా బాలినేనిపై తీవ్రమైన విమర్శలు చేయడంతో అగ్గిరాజుకుంది. చేసిన పాపాల వలనే బాలినేని ఒంగోలు రాలేకపోతున్నాడని అనడంతో జనసేన నాయకులు రియాక్ట్ అయ్యారు.

ఏడుగురు పీఏలతో జే ట్యాక్స్ వసూళ్లు...

ఒంగోలులో ఎక్కడకు వెళ్లినా, ఎవరిని ప్రశ్నించినా జే ట్యాక్స్ గురించే మాట్లాడుతున్నారని, ఏడుగురు పీఏలను పెట్టుకుని వ్యాపారులు, కార్మికుల నుంచి కూడా జే ట్యాక్స్ వసూలు చేస్తున్నాడని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మీద జనసేన నాయకులు విరుచుకుపడ్డారు. శుక్రవారం లాయర్‌పేటలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి దామచర్ల మీద ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబుకుగానీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కుగానీ, మంత్రి నారా లోకేష్‌కుగానీ ఏడుగురు పీఏలు లేరని, దామచర్ల ఒక్కడే ఏడుగురు పీఏలను నియమించుకుని అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఐవీఆర్ సర్వే చేయిస్తే అవినీతిలో రాష్ట్రంలో దామచర్ల అగ్రభాగంలో నిలుస్తాడని, లోకేష్ దగ్గర దామచర్ల పాపాల లిస్టు ఉందని చెప్పారు. ఒంటరిగా పోటీచేసినప్పుడల్లా చిత్తుగా ఓటమి పాలైన దామచర్ల జనార్దన్.. ఇప్పుడు బాలినేని ఓటమి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌పై జనసేన నాయకులు విమర్శలు చేశారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన దామచర్ల సొంత పార్టీ నాయకుల మీద కేసులు పెట్టించి జైలుకు పంపించడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఓడిపోయినప్పుడల్లా హైదరాబాద్, బెంగళూరు చుట్టూ తిరిగే దామచర్ల నీతులు చెబుతున్నాడని ఎద్దేవా చేశారు.

నామమాత్రంగా మిగిలిన కూటమి...

జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పేరుకు కూటమిలో ఉన్నప్పటికీ ఎవరి కుంపటి వారిదే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. అధికారం మొత్తం టీడీపీ చేతిలో పెట్టుకుని జనసేన, బీజేపీ నాయకులను దూరంగా పెడుతోందని, అధికారిక కార్యక్రమాలకు సైతం కనీసం పిలవడం లేదని ఆ పార్టీ నాయకులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. టీడీపీ తమను ఏమాత్రం గౌరవించడం లేదని, ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తోందని చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కూటమికి కష్టకాలం తప్పదని హెచ్చరిస్తున్నారు.

జనసేన జిల్లా అధ్యక్షుడి మౌనం...

జనసేన నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డిపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ విమర్శలు గుప్పిస్తున్నా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మౌనం పాటించడంపై జనసేనలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రియాజ్ జనసేన అధ్యక్షుడినన్న విషయం మరిచిపోయినట్లున్నాడని, ఆయన టీడీపీ నాయకుడిగా వ్యవహరిస్తున్నాడని జనసేన నాయకులు మండిపడుతున్నారు. దామచర్ల విమర్శలపై రాష్ట్ర అధికార ప్రతినిధి అని చెప్పుకుంటూ తిరిగే నాయకురాలు కూడా నోరు విప్పకపోవడం గురించి జనసేన కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

జూన్ 11న అవిశ్వాస తీర్మానం

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ చైర్మన్‌పై జూన్ 11న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు కమిషనర్ నారాయణరావు కౌన్సిలర్లకు శుక్రవారం నోటీసుల ద్వారా తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన కౌన్సిలర్లు ఒంగోలు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రమిచ్చారు. దీంతో చైర్మన్‌పై వచ్చే నెల 11న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు కౌన్సిలర్లకు కమిషనర్ నారాయణరావు నోటీసులిచ్చారు.

మద్యం దుకాణాలు సమయపాలన పాటించాలి

ఒంగోలు టౌన్: జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు సమయపాలన పాటించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఖాజామొహిద్దీన్ ఆదేశించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు మద్యం దుకాణాలను ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని 23 బార్ అండ్ రెస్టారెంట్లను ఉదయం 10 గంటలకు తెరిచి రాత్రి 11 గంటలకు మూసివేయాలన్నారు. అలాగే మద్యం దుకాణాల చుట్టుపక్కల మద్యం విక్రయించకుండా, ఎంఆర్‌పీ ధరలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా అధికారి దగ్గర నుంచి ఎక్సైజ్ కానిస్టేబుల్ వరకు ప్రతిరోజూ రాత్రి గస్తీ నిర్వహించనున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న 608 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడెడ్ ఉపాధ్యాయులకు 1998 నుంచి మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం లేదన్నారు. 2008 నుంచి ఆరోగ్య కార్డులు మంజూరు కాలేదన్నారు. గత కరోనా సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు 189 మంది మరణించినారనీ, వారి కుటుంబ సభ్యులు, వారి ఆరోగ్యం కోసం ఐదు లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చు చేసినారనీ, అయినా ఫలితం లేదన్నారు.

జగనన్న పర్యటనను విజయవంతం చేయండి

- రైతులకు మద్దతుగా నిలవండి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పక్కన, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు

దర్శి (కురిచేడు): వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీ పొదిలి పొగాకు వేలం కేంద్రం సందర్శనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. దర్శిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిరప, వరి, కంది, పొగాకు వంటి పంటలకు కనీస మద్దతు ధర కూడా ఇవ్వకుండా రైతులను నష్టాలబాట పట్టించిందని విమర్శించారు. అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. జిల్లాలో పొగాకు రైతుల కష్టాలు అన్నీఇన్నీ కావన్నారు. వేలం కేంద్రానికి వెళ్లి పొగాకు అమ్ముడుపోక బేళ్లను వెనక్కు తీసుకెళ్తున్నారన్నారు. పొగాకు రైతుల కష్టాలు తెలుసుకుని వారికి అండగా నిలిచేందుకు ఈ నెల 28వ తేదీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి వేలం కేంద్రానికి వస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి రైతు సోదరులు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి జగనన్న పర్యటనను విజయవంతం చేయాలని బూచేపల్లి కోరారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మద్దతు ధర కల్పించి వారికి భరోసా ఇచ్చారని కొనియాడారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లుతెరిచి రైతులను ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, తూము వెంకట సుబ్బారెడ్డి, ముండ్లమూరు ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ రత్నరాజు, దర్శి వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి మునలయ్యాయాదవ్, రాష్ట్ర మున్సిపాలిటీ వింగ్ కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జీ దేవప్రసాద్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొల్లా భాస్కర్, వైఎస్సార్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కలెక్టర్‌గారూ.. మా గోడు ఆలకించండి

- ఒంగోలు జీజీహెచ్, ఎంసీహెచ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా
- పలువురు బాధితుల ఆవేదన
- రోగులకు ఇబ్బంది కలిగించొద్దని కలెక్టర్ ఆదేశాలు
- రోగులతో నేరుగా మాట్లాడి వివరాల సేకరణ
- వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ సూచన
- కంగారు వార్డును పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు

ఒంగోలు టౌన్:

అమ్మా.. సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం వచ్చాం. గంటన్నర దాటింది. ఎవరూ పట్టించుకోవడం లేదు. వీల్ చైర్ అడిగితే ఇవ్వడంలేదు. మాకు సాయం చేయండమ్మా :

వృద్ధురాలు కాళహస్తి లక్ష్మి కుమారుడు

మా ఆడపడుచు బేగం పఠాన్ జయరాం థియేటర్ సమీపంలో నివసిస్తుంటుంది. ఆమెకు ఒక కాలులేదు. మంచీచెడులు చూసుకునేందుకు భర్త, పిల్లలు లేరు. దయచేసి వికలాంగుల సర్టిఫికెట్ ఇప్పించండి మేడమ్ :

సయ్యద్ ఆయిషా

మా మరదలు తేళ్ల అశ్వినికి మాతా శిశు వైద్యశాలలో ఆపరేషన్ చేశారు. కళ్లు పచ్చగా ఉన్నాయి. మూత్రం ఆగిపోయింది. అత్యవసర చికిత్స కోసం జీజీహెచ్‌కి తరలించారు. ఇక్కడ యూరాలజిస్టు లేడంటున్నారు. గుంటూరు వెళ్లమని చెబుతున్నారు. మేము చాలా పేద వాళ్లం. మాకు సాయం చేయండి మేడమ్ :

అశ్విని బంధువులు



జీజీహెచ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న కలెక్టర్

కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఒంగోలులోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)ను ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు ఎదురైన సంఘటనలు ఇవి. సదరం సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వచ్చిన 80 ఏళ్ల వృద్ధురాలి కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు తమ గోడు వినిపించుకున్నారు. ఆస్పత్రికి వచ్చి గంటన్నరయిందని, కనీసం వీల్ చైర్ అడిగినా ఇవ్వలేదని తెలిపారు. దాంతో ఆస్పత్రి బయట ఆటోలోనే కూర్చుని ఉన్న లక్ష్మి వద్దకు కలెక్టర్ స్వయంగా వెళ్లి పలకరించారు. వీల్ చైర్ ఎందుకు ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను ఇబ్బంది పెట్టవద్దని ఆదేశించారు. వీల్‌చైర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.

కలెక్టర్‌కు పలువురు రోగుల ఫిర్యాదు...

జీజీహెచ్‌లో అభా రిజిస్ట్రేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అక్కడ మైకు పనిచేయకపోవడంతో వెంటనే దాన్ని సరిచేయించాలని అక్కడే నిలుచున్నారు. ఆ సమయంలో ఆమెతో పలువురు రోగులు మాట్లాడుతూ.. మీరున్నంత సేపు బాగానే పనిచేస్తారు మేడం.. ఆ తరువాత ఎవరూ పట్టించుకోరంటూ ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి ఆర్థోపెడిక్ వార్డు వద్దకు కలెక్టర్ వెళ్లారు. దారిలో కనిపించిన రోగులను పలకరించారు. ఎందుకు వచ్చారు. ఎంత సేపయింది, వైద్యులు బాగానే చూస్తున్నారా..? అంటూ వాకబు చేశారు. కంగారు వార్డు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా వార్డు పనులు పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలని ఆదేశించారు. కంగారు వార్డులోని బెడ్లు, మరుగుదొడ్లను పరిశీలించారు.

అలసత్వం వద్దు...

కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవల్లో అలసత్వం ప్రదర్శించవద్దని, రోగులు సంతృప్తి చెందేలా సత్వర వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి స్పష్టం చేశారు. ఎంఎన్‌బీయూ పనులు పురోగతిలో ఉన్నాయని, సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో కోవిడ్ పాజిటివ్ కేసులు వస్తున్నందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రద్దీ ప్రదేశాలు, సభలు, సమావేశాలలో దూరం పాటించాలని, తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని ప్రభుత్వం సూచించిన విషయాన్ని వివరించారు. ఎవరికైనా కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఎంసీహెచ్‌ని తనిఖీ చేసిన కలెక్టర్...

ముందుగా మాతా శిశు వైద్యశాల (ఎంసీహెచ్)ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ కౌంటర్ వద్ద నిలబడి పరిశీలించారు. ఆ తర్వాత ఆపరేషన్ థియేటర్, యాంటినేటల్ రూం, స్టెరిలైజేషన్ గది, కాన్పుల వార్డును పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, మాతా శిశు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు, ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత తదితరులు ఉన్నారు.



మాతా శిశు వైద్యశాలలో ఓపీని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కొమరోలు రోడ్డు ప్రమాదంలో లారీ కిందకు సగభాగం దూసుకెళ్లిన కారు
- కారు ముందు సీట్లలో ఇరుక్కుపోయిన మృతదేహాలు జేసీబీ సాయంతో వెలికితీత
- మొత్తం ఆరుగురు మృతిచెందగా, మరో ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు
- అందరూ బాపట్ల జిల్లా స్టూవర్టుపురానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు
- కారు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణంగా నిర్ధారించిన పోలీసులు
- వైరల్ అవుతున్న సీసీ టీవీ ఫుటేజ్

జేసీబీ సహాయంతో కారును వెనక్కు లాగిస్తున్న పోలీసులు



అరగంట శ్రమించి.. మృతదేహాలను వెలికితీసి

కొమరోలు: ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఆరుగురు మృతిచెందిన సంఘటన జిల్లాలో తీవ్ర విషాదం నింపింది. అమరావతి–అనంతపురం జాతీయ రహదారిపై కొమరోలు మండలంలోని తాటిచెర్లమోటు సమీపంలో హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో చోటుచేసుకున్న పలు విషయాలు జిల్లావాసులను ఉలికిపాటుకు గురిచేశాయి. డ్రైవర్ కర్రెద్దుల దివాకర్ కారును అతివేగంగా నడపడం కారణంగా లారీని ఢీకొట్టి సగభాగం వరకూ లారీ కిందకు కారు దూసుకెళ్లింది. దీంతో కారు ముందు సీట్లలో ఉన్న డ్రైవర్ దివాకర్, పక్క సీటులో ఉన్న బొచ్చు సన్ని మృతదేహాలు ఇరుక్కుపోయాయి. వారి మృతదేహాలను కారులో నుంచి బయటకు తీసేందుకు జేసీబీ సహాయంతో అరగంటపాటు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. రెండు మృతదేహాలు ఛిద్రమైపోయి భయాందోళన కలిగించేలా ఉన్నాయి.

ఒక్కసారిగా పెద్ద శబ్దం...

డ్రైవర్ దివాకర్ అతివేగంగా కారు నడుపుతూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వినిపించినట్లు రోడ్డుపక్కన పెట్రోలు బంకులో ఉన్న వ్యక్తులు తెలిపారు. అతివేగం కారణంగా లారీని బలంగా ఢీకొని లారీ కిందకు సగభాగం వరకు కారు దూసుకెళ్లడంతో ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదం అంతా పెట్రోలు బంకులోని సీసీ టీవీలో రికార్డయింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బాపట్ల జిల్లా స్టూవర్టుపురం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. గజ్జల అంకాలు (40), గజ్జల భవాని (25), గజ్జల నరసింహులు (20), గజ్జల జనార్దన్ (30), బొచ్చు సన్ని (30), కర్రెద్దుల దివాకర్ (30) మృతిచెందారు. మరో ఇద్దరు చిన్నారులు జీతన్, శిరీషలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడు జీతన్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలించారు. చిన్నారి శిరీష ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



కారులో నుంచి మృతదేహాలను వెలికితీస్తున్న స్థానికులు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు ముందు భాగం

కుటుంబ కలహాలపై చర్చించి పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తుండగా...

బాపట్ల జిల్లా స్టూవర్టుపురం గ్రామంలో నివసిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులు.. ఇద్దరు చిన్నారులతో కలిసి కుటుంబ కలహాలపై చర్చించేందుకు నంద్యాల జిల్లా డోన్‌లోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ చర్చల అనంతరం నంద్యాల జిల్లాలోనే ఉన్న మహానంది పుణ్యక్షేత్రానికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన మార్కాపురం డీఎస్పీ...

ఘోర రోడ్డు ప్రమాదంపై సమాచారం అందుకున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో పెట్రోల్ బంకు ఉండటంతో అందులోని సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు. కారు అతివేగంగా వెళ్లి లారీని ఢీకొన్నట్లు తెలుసుకున్నారు. పలకల లోడుతో వెళ్తున్న లారీని కారు వేగంగా ఢీకొట్టిందని డీఎస్పీ నాగరాజు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులోని ఆరుగురు మృతిచెందడం బాధాకరమని అన్నారు. సంఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సంఘటన స్థలంలో సహాయక చర్యల్లో గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్, కంభం సీఐ మల్లికార్జునరావు, కొమరోలు, గిద్దలూరు, అర్ధవీడు, కంభం ఎస్సైలు నాగరాజు, ఇమ్మానియేలు, సుదర్శన్, నరసింహారావు, గిద్దలూరు సర్కిల్ పోలీసుస్టేషన్లలోని సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పర్శ్ సమస్యల పరిష్కారానికి కృషి

- సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ వీవీ రెడ్డి



మాజీ సైనికులతో మాట్లాడుతున్న సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్

కంభం: స్థానిక మాజీ సైనికుల సంఘం కార్యాలయాన్ని శుక్రవారం సైనిక్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ వీవీ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పర్శ్ సమస్యలు పరిష్కరించడం కోసం జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలో ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని అందుబాటులో ఉంచుతామని తెలిపారు. మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు శెట్టం వేణుగోపాల్ మాట్లాడుతూ.. మాజీ సైనికులకు ఇంటి పన్ను ఎలాంటి షరతులు లేకుండా మినహాయింపు ఇవ్వాలని, రేషన్ కార్డుతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందజేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సైనికులు పుల్లయ్య, పోలయ్య, సంకతాల ప్రసాద్, మస్తాన్‌వలి, పాండు రంగయ్య, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఒంగోలులోని భారత జాతీయ వ్యాయామ కళాశాలలో ఆదివారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.భక్త ధృవుడు ఓ ప్రకటనలో తెలిపారు. పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ విభాగాల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాలబాలికలు, మాస్టర్స్ స్త్రీ, పురుష క్రీడాకారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, వయసు ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వివరాలకు 8142555000ను సంప్రదించాలని సూచించారు.

సీఐపై దాడి కేసులో నిందితుల అరెస్టు

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో ఉన్న ఒంగోలు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావుపై దాడికి పాల్పడిన నిందితులను పోలీసులు శుక్రవారం కటకటాల్లోకి నెట్టారు. ఈ నెల 19వ తేదీ తెల్లవారుజామున కర్నూలు బైపాస్‌లోని ఒక హోటల్ వద్ద గొడవ చేస్తున్న యువకులను అదే సమయంలో అటుగా వచ్చిన టూటౌన్ సీఐ మందలించారు. పీకల దాకా తప్పతాగిన ఆ యువకులు ఎదుట ఉన్నది పోలీస్ అధికారి అనే స్పృహ లేకుండా అనూహ్య రీతిలో దాడికి పాల్పడ్డారు. మద్యం మత్తులో ఉన్న యువకులు దాడి చేయడంతో సీఐ తలకు గాయమైన సంగతి పాఠకులకు తెలిసిందే. కాగా, పరారైన నిందితులు కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామానికి చెందిన తూముకూరి చంద్రశేఖర్, ఒంగోలు నగరంలోని కొప్పోలుకు చెందిన పాటూరి ప్రశాంత్ కుమార్, క్లోపేటకు చెందిన దొడ్డి స్టీఫెన్ రాజాగా గుర్తించిన పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

సింగరాయకొండ: ఒంగోలు నుంచి నెల్లూరు వైపు వెళ్లే రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి(47) మృతి చెందిన సంఘటన శుక్రవారం సింగరాయకొండ మండల పరిధిలోని దేవి సీ ఫుడ్స్ సమీపంలో వెలుగుచూసింది. ఒంగోలు జీఆర్పీ ఎస్సై కె.మధుసూదనరావు కథనం ప్రకారం.. మృతునికి సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుంది. శరీరంపై మెరూన్ రంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. కాగా ఇతను రైల్లో నుంచి జారిపడ్డాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అన్న విషయంపై విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440627647కు సమాచారం అందించాలని కోరారు.

లారీ ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

మద్దిపాడు: లారీ ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం మద్దిపాడు మండలంలోని బెల్లంపల్లి వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. వడ్లమూడి సరోజనమ్మ(70) తమ సుగ్రామమైన మేదరమెట్ల నుంచి వెల్లంపల్లికి బయలుదేరింది. జాతీయ రహదారిపై దిగి అక్కడ నుంచి వెల్లంపల్లి వెళ్లడానికి జాతీయ రహదారి దాటేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో సరోజనమ్మ తల వెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు మద్దిపాడు 108 వాహన సిబ్బంది వృద్ధురాలిని ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. మద్దిపాడు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

తిరస్కారమే పరిష్కారమా?

పొగాకుకు మద్దతు ధర ఇవ్వాలని రైతులు.. మాటలతో మభ్యపెడుతున్న పాలకులు

- పొదిలి కేంద్రంలో వేలానికి ఉంచిన బేళ్లు 36,586
- వ్యాపారుల తిరస్కరణకు గురైనవి 10,031
- మండుతున్న ఎండలతో తగ్గుతున్న బేళ్ల తూకం, నాణ్యత
- రిటర్న్ బేళ్లను తిరిగి వేలానికి తేవాలంటే అధిక భారం



పొదిలిలో రిటర్న్ బేళ్లను ట్రాక్టర్‌లో ఎక్కిస్తున్న రైతులు

పొదిలి:

పొగాకు రైతులతో వ్యాపారులు బంతాట ఆడుతుండగా రాష్ట్ర ప్రభుత్వం గుడ్లప్పగించి చోద్యం చూస్తోంది. మద్దతు ధర కల్పిస్తామని మాయమాటలు చెబుతూ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కాలం వెళ్లబుచ్చుతున్నారే కానీ.. వ్యాపారులు, రైతులకు మధ్యేమార్గంగా వ్యవహరించి ఓ నిర్ణయం తీసుకోకుండా జాగు చేస్తున్నారు. ప్రస్తుతం పొగాకు వేలం కేంద్రాల్లో పరిణామాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తొలుత ఆశాజనకంగా ప్రారంభమైన పొగాకు వేలం ప్రక్రియ రోజుల వ్యవధిలోనే రైతుల ఆశలను అడియాసలు చేసింది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను దించడంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు సతమతం అవుతున్నారు. వేలానికి ఉంచిన బేళ్లు భారీగా తిరస్కరణకు గురవుతుండటం, మరో వైపు మద్దతు ధర లేకపోవడంతో పొగాకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పొదిలిలో పొగాకు వేలం తీరు రైతుల ఆందోళనను రోజురోజుకూ పెంచుతోంది. ధరలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన ఒక వైపు, మరో వైపు రిటర్న్ బేళ్ల టెన్షన్ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మండుతున్న ఎండల్లో బేళ్లను వేలం కేంద్రానికి పదే పదే తీసుకురాలేక రైతులు వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే పొగాకు బేళ్ల తూకంతో పాటు నాణ్యత తగ్గిపోతుండటంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదిలి వేలం కేంద్రానికి ఈ నెల 22వ తేదీ వరకు 36,586 బేళ్లను తీసుకురాగా 25,886 బేళ్లు కొనుగోలయ్యాయి. గత బుధవారం ఒక్క రోజే 829 బేళ్లను రైతులు వేలంలో ఉంచగా 310 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రిటర్న్ బేళ్లను స్థానికంగా నిల్వ చేసే అవకాశం లేక, తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక రైతులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీకావు. కొంత మంది రైతులు మాత్రమే ఒక్కో బేల్‌కు రోజుకు రూ.10 చొప్పున అద్దె చెల్లిస్తూ వేలం కేంద్రం సమీపంలో నిల్వ చేసుకుంటున్నారు. మిగిలిన వారికి ఆ అవకాశం లేక బేళ్లను తీసుకుని ఇంటి బాట పడుతున్నారు.

తిరస్కరించినవి 25 శాతం

పొదిలి వేలం కేంద్రానికి ఇప్పటి వరకు వచ్చిన మొత్తం బేళ్లలో సుమారు 25 శాతం తిరస్కరణకు గురయ్యాయి. వ్యాపారులు ఎఫ్ 1, ఎఫ్ 2 రకాల కొనుగోళ్లకు మొగ్గు చూపుతుండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సుమారు 30 శాతం మేర ఈ రెండు రకాలే ఉండటంతో మిగిలిన బేళ్ల పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొదిలి వేలం కేంద్రంలో రిటర్న్ బేళ్ల వివరాలు ఇలా.. (నోట్ : ఈ నెల 22వ తేదీ వరకు)

మొత్తం వేలానికి ఉంచిన బేళ్లు	36,586
కొనుగోలు చేసినవి	25,886
రిటన్ బేళ్లు	10,031
నో సేల్	1,56
నో బిడ్	7,127
రైతు రిజక్షన్	1,022
కంపెనీ రిజెక్షన్	1,712
బీఆర్	14
జంపింగ్ బేళ్లు	669

రైతులపై రూ.50 లక్షల అదనపు భారం

వివిధ కారణాలతో తిరస్కరణకు గురైన బేళ్లను రైతులు ఇంటికి తీసుకెళ్లి మళ్లీ వేలం కేంద్రానికి తీసుకురావాలంటే సగటున రూ.500 వరకు ఖర్చు అవుతోంది. ఈ లెక్కన రైతులు ఇప్పటి వరకు సుమారు రూ.50 లక్షల మేర అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ముందుముందు ఈ అదనపు వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. రిటర్న్ బేళ్లను మళ్లీ వేలంలో ఉంచినా నాణ్యతకు తగిన ధర ఇచ్చి కొనుగోలు చేస్తారనే నమ్మకం రైతుల్లో సన్నగిల్లిపోతోంది.

కొనుగోళ్లు త్వరితగతిన జరగాలి



పొగాకు బేళ్లు వెనక్కి తీసుకెళ్లడం రైతులకు అన్ని విధాలుగా నష్టదాయకం. బేళ్ల పునర్నిర్మాణం తలకు మించిన భారం. అటు ఇటు తిప్పడం వల్ల రవాణా చార్జీలు తడిసి మోపెడవుతున్నాయి. మండుతున్న ఎండలతో బేళ్ల తూకం తగ్గుతోంది. నాణ్యతపైనా ప్రభావం పడుతోంది. మార్కెట్ ధర తగ్గకుండా చూడటం ఎంత అవసరమో, బేళ్లు తిరస్కరించకుండా కొనుగోలు చేయడం కూడా అంతే ముఖ్యం. బోర్డు అధికారులు తగిన చర్యలు తీసుకుని రైతులకు మేలు చేయాలి.

– తాతిరెడ్డి పెద్ద వెంకటరెడ్డి, నాగంపల్లి

అదనపు వ్యయం అవుతోంది



సగటు ధరలు పడిపోకుండా చూడటంతోపాటు, రిటర్న్ బేళ్ల సంఖ్యను క్రమేపీ తగ్గించాలి. రైతు నాలుగు బేళ్లు తెస్తే వాటిలో ఒకటి కొనుగోలు చేసి, మూడు తిరస్కరిస్తే మేలు జరగదు. వేసవి కావడం వల్ల బేళ్లు పునర్నిర్మించే సమయంలో ఆకు నలిగిపోయే ప్రమాదం ఉంది. రైతులకు అదనపు వ్యయం అవుతుంది. వ్యాపారులు, బోర్డు అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ రైతులకు అన్ని విధాలుగా న్యాయం చేయాలి.

– కె.సుబ్బారావు, తలమల్ల

సగానికి సగం రిటర్న్ బేళ్లు



వ్యాపారులు తక్కువగా ఉండటం, వారు కూడా హై గ్రేడ్ పొగాకు కొనుగోలు వైపు మొగ్గు చూపుతుండటంతో రిటర్న్ బేళ్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. వేలానికి తెచ్చిన బేళ్లలో సగానికి సగం ఇంటికి తీసుకవెళ్లాలంటే రైతులకు అదనపు ఖర్చులు అవుతున్నాయి. రిటర్న్ బేళ్లను మళ్లీ వేలంలో ఉంచితే మంచి ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తారన్న నమ్మకం కలగడం లేదు.

– కె.భాస్కరరెడ్డి, జువ్వలేరు

రైలు నుండి జారిపడి వృద్ధుడు మృతి



రైల్వే ట్రాక్‌పై వృద్ధుడి మృతదేహం

కురిచేడు: రైలు నుంచి జారిపడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన కురిచేడు-గుండ్లకమ్మ రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. నంద్యాల-గుంటూరు మార్గంలో 103-15-16 మైల్ స్టోన్ వద్ద రైల్వే ట్రాక్‌పై శుక్రవారం ఓ వృద్ధుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. వృద్ధుడి మృతదేహంపై తెల్లని చొక్కా, తెల్లని పంచె ఉన్నాయి. వయసు సుమారు 60 ఏళ్లు ఉండవచ్చని అంచనా. మృతదేహాన్ని రైల్వే పోలీసులు వినుకొండలోని మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 9440438256, 7013600365ను సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

నర్సాపూర్-హుబ్లీ రైళ్లకు అదనపు బోగీలు

మార్కాపురం: ఈనెల 29వ తేదీ నుంచి మార్కాపూర్ రోడ్ రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లే నర్సాపురం-హుబ్లీ, నర్సాపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్(నంబర్లు : 17225/17226) రైళ్లకు రెండు ఏసీ 2 టైర్, ఒక స్లీపర్ అదనపు బోగీలను శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటు చేస్తున్నారని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌యూసీసీ మెంబర్ ఆర్‌కేజే నరసింహం తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి మార్కాపురం మీదుగా వెళ్లే మచిలీపట్నం-యశ్వంత్‌పూర్, మచిలీపట్నం-కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలుకు శాశ్వత ప్రాతిపదికన ఒక అదనపు ఏసీ త్రీటైర్ బోగీ అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఇందులో ఒక ఏసీ ఫస్ట్ క్లాస్, 2 ఏసీ టూటైర్, 7 ఏసీ త్రీటైర్, 6 స్లీపర్, ఒక జనరల్, ఒక బ్రేక్ వ్యాన్, ఒక పవర్‌కార్ బోగీలు ఉంటాయని వివరించారు. మార్కాపురం మీదుగా గుంటూరు-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 27 నుంచి శాశ్వత ప్రాతిపదికన ఒక స్లీపర్, ఒక జనరల్ బోగీని అదనంగా రైల్వే అధికారులు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈనెల 25నుంచి మార్కాపురం మీదుగా వెళ్లే గుంటూరు-ఔరంగాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మరొక అదనపు స్లీపర్ బోగీని శాశ్వత ప్రాతిపదికపై రైల్వే అధికారులు ఏర్పాటు చేశారని వెల్లడించారు.

జిల్లాలో విద్యుత్ బకాయిలు రూ.600 కోట్లు

- చింతగుంట్ల వద్ద మృతి చెందిన గేదెలకు పరిహారం ఇస్తాం
- వర్షా కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- విద్యుత్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు, పక్కన ఈఈ నాగేశ్వరరావు

మార్కాపురం: జిల్లాలో సుమారు 600 కోట్ల రూపాయల విద్యుత్ బకాయిలు ఉన్నాయని, వీటి వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని ఆ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మార్కాపురం ఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా వెలుగొండ ప్రాజెక్టు రెండు టన్నెల్స్ విద్యుత్ బకాయిలు సుమారు రూ.97 కోట్లు ఉన్నాయని, ఇంకా ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ల నుంచి అధిక మొత్తంలో బకాయిలు వసూలు కావాల్సి ఉందని చెప్పారు. జిల్లాకు 1200 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం కాగా ఇప్పటి వరకు 300 వచ్చాయని, మిగిలినవి మరో మూడు నెలల్లో వస్తాయని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో వెయ్యి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని ఇంకా 2,500 విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. మార్కాపురం డివిజన్‌లో 600 మంది రైతులకు వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చామని, ఇంకా 1200 మంది రైతులకు ఇవ్వాల్సి ఉందని వివరించారు.

సబ్‌స్టేషన్లు మంజూరు

గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు మండలంలోని కసినేపల్లి, రాచర్ల మండలంలోని మేడవారిపల్లి, పొదిలిమండలంలోని ఏలూరు, కురిచేడు మండలంలోని కల్లూరు, యర్రగొండపాలెం మండలంలోని గండిబావి చెరువు, కందుకూరు మండలంలోని మన్నేటికోట, కనిగిరిలోని గార్లపేట రోడ్డు, సంతనూతలపాడు మండలంలోని బూదవాడ, ఒంగోలులోని మంగమ్మ కాలేజీ వద్ద, ఒంగోలు పట్టణంలోని హౌసింగ్ బోర్డులో, టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కాగా వీటిలో కొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు.

పశుపోషకులకు నష్టపరిహారం ఇస్తాం

మార్కాపురం మండలంలోని తిప్పాయిపాలెం-చింతగుంట్ల గ్రామాల మధ్య హెచ్‌టీ విద్యుత్ లైన్లు తగిలి 18 గేదెలు మృతి చెందాయని, వీటి యజమానులకు ఒక్కో గేదెకు రూ.40 వేల చొప్పున నష్టపరిహారం అందజేస్తామని ఎస్ఈ పేర్కొన్నారు. శుక్రవారం డీఈ, ఏడీఈ, ఏఈతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పశుపోషకులతో మాట్లాడినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రజలు కూడా రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ వాడకం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే సమయంలో ఇంట్లో గీజర్, హీటర్, ఇతర విద్యుత్ ఉపకరణాలు వినియోగించవద్దని స్పష్టం చేశారు. అనంతరం డివిజన్‌లోని విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఈఈ నాగేశ్వరరావు, ఎడిఈ సియా నాయక్, ఏఈలు నాగేందర్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన బసినేపల్లె ఎడ్లు



బండ లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని చింతలపాలెం వీరాంజనేస్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బేస్తవారిపేట మండలం బసినేపల్లెకు చెందిన వెంకట చైతన్యకుమార్ ఎడ్లు, గిద్దలూరు మండలం బురుజుపల్లెకు చెందిన వెంకట సోహిత్ ఎడ్లు, రాచర్ల మండలం కుంటకాడిపల్లికి చెందిన దందూరి శ్రీనివాసులు, బి.భూపాల్ సంయుక్త ఎడ్ల జత, కంభం మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన హేమలత నాయుడు ఎడ్లు వరుసగా మొదటి, రెండో, మూడో, నాలుగో స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున దాతల చేతులమీదుగా అందజేశారు.

'ఉపాధి' అక్రమాలపై విచారణ.. ఇలాగేనా?

- ఏపీడీ క్షేత్రస్థాయిలో పర్యటించకుండా మోకాలడ్డు
- సచివాలయంలో కూర్చోబెట్టి అక్రమాల్లేవని చెప్పే యత్నం



మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌తో గొడవ పడుతున్న ఓ వర్గం వారు

పాత ఫీల్డ్ అసిస్టెంట్‌పై దౌర్జన్యం

కొనకనమిట్ల: కొనకనమిట్లలో ఇటీవల చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో దొంగ మస్టర్లు వేసి అవకతవకలకు పాల్పడిన వైనంపై ఏపీడీ విచారణకు రాగా ఓ వర్గం మోకాలడ్డింది. పనుల్లో అక్రమాలకు పాల్పడి ప్రజాధనం దుర్వినియోగం చేశారని గ్రామనికి చెందిన పలువురు ఒంగోలు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీడీ లలిత కుమారి శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. పనులకు రానివారికి, గ్రామంలో లేనివారికి మస్టర్ వేసి నిధులు దుర్వినియోగం చేస్తున్నట్లు ఫిర్యాదు అందిందని తెలిపారు. విచారణ నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. ఆమె వెంట ఏపీఓ బుల్లెన్నరావ్ ఉన్నారు.

ఏపీడీ విచారణ చేసి వెళ్లిన తర్వాత ఓ వర్గం వారు మాజీ ఫీల్డ్ అసిసెంట్‌పై దౌర్జన్యానికి దిగారు. తమపైనే ఫిర్యాదు చేయిస్తావా అంటూ హెచ్చరించారు. కాగా విచారణ పేరుతో గ్రామంలోకి వచ్చిన ఏపీడీ చేసిందేమీ లేదని పలువురు ఆరోపించారు. ఏపీడీని ఫీల్డ్‌కు వెళ్లనీయకుండా ఓ వర్గం వారు సచివాలయంలో కూర్చోబెడితే అక్రమాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఈ తరుణంలో సచివాలయం నుంచి వెళ్లిన ఏపీడీ ఓ ఫిర్యాదుదారుడిని మండల పరిషత్ కార్యాలయంలో విచారణకు రావాలని పిలిచారు. కూటమి నాయకులు దాడికి పాల్పడతారనే ఉద్దేశంతో అతను ఏపీడీ పిలుపును తిరస్కరించినట్లు సమాచారం.

అంబేడ్కర్‌ను అవమానించినా కేసుల్లేవ్

- అధికార పార్టీ నేతలకు తొత్తుగా మారిన ఎస్సైని సస్పెండ్ చేయాలి
- దళిత మంత్రి స్వామి నియోజకవర్గంలో ఘటన జరగడం దారుణం
- జరుగుమల్లి పోలీస్ స్టేషన్ వద్ద దళిత సంఘాల ధర్నా



జరుగుమల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘ నాయకులు

జరుగుమల్లి(సింగరాయకొండ): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలో అంబేడ్కర్ ఊరేగింపును అడ్డుకున్నా పోలీసులు చర్యలు తీసుకోకుండా ఓ వర్గానికి కొమ్ముకాయడం దారుణమని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. జరుగుమల్లి మండలం కె బిట్రగుంట గ్రామంలో ఏప్రిల్ 14వ తేదీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజున ఊరేగింపును అడ్డుకున్న అగ్రవర్ణాల వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసు కట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సై బి.మహేంద్రను సస్పెండ్ చేయాలని కోరుతూ శుక్రవారం దళిత సంఘం నాయకుడు నీలం నాగేంద్రం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కె.బిట్రగుంటలో బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాల ఊరేగింపును అగ్రవర్ణాల వారు అడ్డుకున్న సమయంలో సింగరాయకొండ సీఐ సీహెచ్ హజరత్తయ్య, జరుగుమల్లి ఎస్సై బి.మహేంద్ర వచ్చి దళితులకు సూక్తులు చెప్పారే తప్ప కార్యక్రమ నిర్వహణకు సహకరించలేదని ఆరోపించారు. దీనిపై ఏప్రిల్ 29వ తేదీన ఫిర్యాదు చేసినా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో దళితులు అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.